క్లుప్తంగా

నేడు పీఠంలో లక్ష బిల్వార్చన

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో కార్తీక శుద్ధ దశమిని పురస్కరించుకుని బుధవారం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించనున్నారు ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. పీఠంలో బుధవారం భవాని శంకర అష్టమలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించనున్నట్టు వివరించారు. అలాగే పీఠంలో ఉన్న విజయ వేంకటేశ్వర స్వామికి తులసిదళ అర్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించడంతో పాటు కార్తిక సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆధార్ నవీకరణ శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో మంగళవారం ఆధార్ నవీకరణ శిబిరం నిర్వహించారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దొరబాబు గ్రామస్తుల ఆధార్ కార్డులోని వివరాలను వారి దరఖాస్తు మేరకు నవీకరించారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తిన వారు ఆధార్ కార్డులోని తమ ఫోటో, వేలిముద్రలు, అడ్రస్, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలను పొందారు.

శిథిల వంతెనను పునర్నిర్మించాలి



ఆర్యావటం-కూరాడ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన

కాజులూరు: ఆర్యావటంలో ముత్తావారి గరువు వద్ద కురాడ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెనను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ముత్తావారి గరువు నుంచి ప్రధాన గ్రామమైన ఆర్యవటం వెళ్లేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం అధికారులు డ్రెయిన్‌పై కాలిబాట వంతెనను నిర్మించారు. నాణ్యతా లోపం కారణంగా కొద్ది రోజులకే అది శిథిలావస్థకు చేరింది. వంతెనకిరువైపులా రక్షణ గోడలు, అప్రోచ్‌లు ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీల్లేకుండా ఉంది. పాదచారులూ భయంభయంగా వంతెనపై నడక సాగిస్తున్నారు. వంతెన పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవన నైపుణ్యానికి గ్రంథ పఠనం అవసరం



మండపేట ప్రభుత్వ కళాశాలలో విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న ప్రిన్సిపాల్

కపిలేశ్వరపురం (మండపేట): జీవన నైపుణ్యం మెరుగుపర్చుకోవడానికి గ్రంథ పఠనం దోహదపడుతుందని మండపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీవీకే శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలోని గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ప్రతిభాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ పి.వెంకన్నను, అధ్యాపకులను అభినందించారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): పేద, మధ్య తరగతి ప్రజలకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. పట్టణంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్లను మంగళవారం పంపిణీ చేశారు. పేదలకు రక్షాబంధన్, ఓనం సందర్భంగా పేదలకు గ్యాస్ సిలండరును రూ.200, ఉజ్వల స్కీమ్ లబ్ధిదారులకు రూ.400 తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి పాలిక రమణ, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

గోమాత అందజేత



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గోమాత, దూడలను అందజేసిన తోగరు మూర్తి కుటుంబం

రామచంద్రపురం రూరల్: గోపాలాష్టమి పురస్కరించుకుని రామచంద్రపురం పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తొగరు మూర్తి, ఆయన సోదరులు తొగరు సుబ్బారావు, తొగరు బ్రహ్మాజీ దంపతులు ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ గోశాలకు ఆవు, దూడలను అందజేశారు. అలాగే రామచంద్రపురం పట్టణంలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఇత్తడి నందీశ్వరుడిని అందజేశారు.

వాతావరణం

- మార్పుతో ఆందోళనలో రైతాంగం
- నిలిచిన ఖరీఫ్ మాసూళ్లు
- అల్పపీడనంతో ఆరుదల సమస్య
- రెండు నియోజకవర్గాల్లో 1,01,732 ఎకరాల్లో వరి సాగు
- ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సంసిద్ధం

కపిలేశ్వరపురం: రైతు నెత్తిన ‘ముసురు’ పడింది. ఖరీఫ్ దిగుబడి ఆశాజనకంగా ఉందని ఆనందపడుతున్న తరుణంలో.. ఊహకందని రీతిలో వరుణుడు కన్నెర్రజేశాడు. చివరి దశకు చేరిన వరి సాగు.. శ్రమ ఫలితం చేతికి దక్కే సమయం.. అంతకంటే ముఖ్యంగా పంట కొనుగోలు బాధ్యతను ప్రభుత్వం చేపట్టిన సంతోషం.. వీటితో ఊపిరి పీల్చుకుంటున్న రైతాంగానికి కంటిపై కునుకు లేకుండా చేసిందీ ముసురు. మరో పది రోజుల్లో వరి మాసూలు పూర్తవుతాయనుకుంటున్న తరుణంలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో.. సాగు ప్రక్రియకు బ్రేక్ పడింది..

రెండు నియోజకవర్గాల్లో..

రామచంద్రపురం మండలంలో 18,806 ఎకరాల్లోను, కె.గంగవరంలో 15,633, కాజులూరులో 19,382, మండపేటలో 16,985, రాయవరంలో 14,593, కపిలేశ్వరపురం మండలంలో 16,333 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. మొత్తం ఆరు మండలాల్లో 1,01,732 ఎకరాల్లో వరిని సాగు చేశారు.

వాతావరణ మార్పులతో..

ఇప్పటివరకు 40 శాతం వరికోతలు పూర్తయ్యాయి. మరో వారం, పది రోజుల పాటు వాతావరణం సహకరిస్తే.. నూరుశాతం మాసూలు ప్రక్రియ పూర్తవుతుంది. మూడు రోజులుగా ముసురు, గాలుల ప్రభావానికి అంగర, పడమర ఖండ్రిక తదితర ప్రాంతాల్లోని వరి చేలు నేలనంటాయి. వరి కోత యంత్రాలు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కోత అనంతరం ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో ఆ పనులు నిలిపివేశారు. కాస్త తెరిపి ఇవ్వగానే వరి కోతలు చేపట్టాలని రైతులు వేచిచూస్తున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి పొందడమూ, ప్రభుత్వం అన్ని విధాలా సాయమందించడంతో ఇప్పటివరకూ వ్యవసాయం సాఫీగా సాగిందని రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అన్నివిధాలా రైతుకు తోడుగా..

ప్రభుత్వం రైతు వెన్నంటి నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. గిట్టుబాటు ధరను అమలు చేయడంతో పాటు, డిమాండ్ ఉన్న చోట మిల్లర్లు అంతకంటే అధిక ధరను ఇస్తానంటే అమ్ముకునే అవకాశాన్ని సైతం కల్పించింది. ప్రభుత్వం ద్వారా అమ్ముకునే రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రామచంద్రపురంలో 21, కె.గంగవరంలో 22, కాజులూరులో 22, మండపేటలో 22, రాయవరంలో 19, కపిలేశ్వరపురంలో 14 మొత్తం 121 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది.

హడలెత్తిస్తున్న వర్షాలు

కాజులూరు: మూలిగే నక్కపై తాటిపండు పడిందన్న చందంగా మారింది తొలకరి రైతుల పరిస్థితి. ఈ ఏడాది ఆరుగాలం శ్రమించి పండించిన పంట పక్వానికి చేరుకున్న దశలో.. మంచి దిగుబడి ఉందని రైతులు ఆశిస్తున్న సమయంలో అకాల ముసురు రైతులను ఆందోళనలోకి నెట్టేసింది. నియోజకవర్గంలో కొన్నేళ్లుగా వరుసగా తొలకరి పంట వర్షాల బారిన పడుతూనే ఉంది. సాగు చివరి దశలో సంభవిస్తున్న అల్పపీడనాలు, తుపాన్లు వ్యవసాయదారులకు తీవ్ర నష్టాలను మిగుల్చుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా అనేక గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో.. ఏపుగా పెరిగిన వరిపైరు నేలనటింది. పొలంలో నిలిచిన వర్షపు నీటిని బయటకు మళ్లించేందుకు బోదెలు ఏర్పాటు చేస్తూ, నేలనంటిన దుబ్బులను నిలబెట్టి కడుతూ, ఉన్న పంటను దక్కించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. మరోవైపు కొందరు రైతులు పంట మాసూళ్లు చేసి, ధాన్యం పొలాల్లోనే రాసులుగా పోసి ఉంచారు. వర్షాలకు వరి కుప్పలు, ధాన్యం రాశులు నీట తడుస్తున్నాయి. ప్రస్తుత వర్షాలు రైతాంగానికి అన్ని విధాలుగా నష్టాలనే కలుగజేస్తాయని రైతులు చెబుతున్నారు. మాసూలు చేసిన పంట వర్షాలకు తడిస్తే, రంగుమారి నాణ్యత లోపిస్తుందని, గింజ గట్టిపడే దశలో ఉన్న పంట వర్షాలకు తడిస్తే దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని రైతులు అంటున్నారు.



పడమర ఖండ్రిక ప్రధాన రహదారిపై బరకంతో కప్పిన ధాన్యం రాశులు



అంగరలో గాలికి నేలనంటిన వరిచేను



గొల్లపాలెంలో వర్షం కురవడంతో ఉరుకులు, పరుగులతో పంటను ఒబ్బిడి చేస్తున్న రైతులు

ఎండ రాక ఆరుదల సమస్య



నాలుగు ఎకరాల్లో పంటను యంత్రం సాయంతో కోయించాను. ముసురుతో ఎండ లేదు. ఆరుదల సమస్య ఎదురైంది. మిల్లర్లకు అమ్ముదామంటే ఆరుదల లేక తక్కువకు అడుగుతారు. ఎండ వస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నాను.

– యానాల సీతారామయ్య, రైతు అంగర

కోతకు ఆగడం మేలు



ఇప్పటి వరకూ 40 శాతం కోతలు పూర్తయ్యాయి. ఎక్కువ మంది యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. కొద్దిపాటి చినుకులు పడుతున్నాయి. వర్షాలు వచ్చే సూచనలుండటం వల్ల రెండు రోజుల పాటు కోయకుండా ఎదురు చూడటం శ్రేయస్కరం.

– కేవీఎస్ రమేష్‌కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం

ఉద్యాన పంటల రక్షణకు ప్రభుత్వం కృషి



అద్దంకివారిలంక సచివాలయంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం : లంక గ్రామాల్లోని ఉద్యాన పంటల పరిరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అద్దంకివారి లంకలో మంగళవారం నిర్వహించిన ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి’ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, సర్పంచ్ నాతి గవరయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు గ్రామంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో స్వామినాయుడు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చొరవతో అంగర గ్రామాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విశేష కృషి చేస్తున్నారని అంగర గ్రామ ప్రజాప్రతినిధులు అన్నారు. స్థానిక సచివాలయం వద్ద మంగళవారం గ్రామాభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ అద్దాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు చేశారని వివరించారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ మేడిశెట్టి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంకాబత్తుల స్వామికాపు, పసలపూడి శ్రీనివాస్, కార్యదర్శి తాతపూడి సుభాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కపిలేశ్వరపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కుల, మత, ప్రాంత, రాజకీయాల కతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధిని చేకూర్చడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురంలో మంగళవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామ మహిళలు ఆయనకు హారతి పట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారం, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు చింతా పెద్దకాపు, కందుల శ్రీను, పిప్పర సంపతరావుతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలను సచివాలయ ఉద్యోగులతో పాటు తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి వివరించారు. అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటోందని గ్రామస్తులు ఎమ్మెల్సీ వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. పేదల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్సీ తోట వారికి భరోసా ఇచ్చారు.

నిరుపేదల ఆశాజ్యోతి సీఎం జగన్



మండపేట 27, 28 వార్డుల్లో బోర్డును ప్రదర్శిస్తున్న నూకదుర్గారాణి, రాజుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల ఆశాజ్యోతి అని మండపేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని 27, 28 వార్డుల్లో మంగళవారం ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే’ కార్యక్రమం జరిగింది. ఆయా వార్డుల కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని మాట్లాడుతూ వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చైర్‌పర్సన్ నూక దుర్గారాణి, కో–ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు మాట్లాడుతూ ఆయా వార్డుల్లో రూ.21.73 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధరం, పార్టీ నాయకులు అధికారి శ్రీనివాస్, ఉలి తాతాజీ, పేకేటి మాణిక్యం, చల్లా ప్రసాద్, ఎండీ కరీముల్లా, షేక్ అన్సారీ, జెట్టి బాబురావు, సుంకర పార్వతి పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని అముజూరు గ్రామంలో మంగళవారం ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే’ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కారణంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని చెప్పారు. గ్రామసభ అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ నానాపరపు కల్యాణి శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, కన్వీనర్లు పెంకే రవిచంద్ర, గెద్దాడ సతీష్, నీతిపూడి కొండ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారానే విజ్ఞానం



పామర్రులో విద్యార్థులకు బహుమతులు అందించిన ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞాన మార్గంలో నడిపించే మార్గదర్శకాలని ఎంఈఓ నాగరాజు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం పామర్రులోని గ్రంథాలయం వద్ద వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, గ్రంథపాలకుడు ఎస్.గంగాధర్, ఉపాధ్యాయులు అంజిబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



చెల్లూరులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రాఘవ తదితరులు

రాయవరం: రాష్ట్రాన్ని సంక్షేమ, ఆర్థిక పథంలో నడిపించడం కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరులో సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో మంగళవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ, రాఘవ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి చాలా అవసరమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం అన్ని వర్గాలకు ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి బోర్డులను సర్పంచ్ రాఘవ ఆవిష్కరించారు. అలాగే వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వైట్ల వీరవేణి, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేష్, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం



తాళ్లపాలెంలో పథకాల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు



కుయ్యేరులో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

రామచంద్రపురం రూరల్: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని తాళ్లపాలెం సర్పంచ్ కట్టా గోవిందు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో మంగళవారం సాయంత్రం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గోవిందు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను, సంక్షేమాన్ని సచివాలయాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందేలా చేశారన్నారు. ఇదే ఒరవడి మళ్లీ కావాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఫ్లెక్సీ ద్వారా ప్రదర్శించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు పలివెల నాగరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వల్లు శివ, గృహసారథులు మేడిశెట్టి జనార్ధన్, పంపన వీరవెంకట సత్యనారాయణ, దొమ్మేటి నాగబాబు, మేడిశెట్టి రవికుమార్, పంపన శ్రీనివాస్, అడపా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుందర్‌లాల్, వలంటీర్లు పాల్గొన్నారు.

కుయ్యేరులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

కాజులూరు: మండలంలోని కుయ్యేరులో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు తదితర నేతలు పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో జరిగిన సభలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వివిధ పథకాల ద్వారా ప్రజలకు జగనన్న అందించిన లబ్ధిని వివరించారు. వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. అనంతరం పల్లె నిద్ర చేసారు. ఆయా కార్యక్రమాల్లో మండల గృహ సారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణ, ఆర్ఎంసీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్, కాజులూరు ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు కాకి శ్రీను, కోలంక ఎంపీటీసీ పంపన శ్రీను, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నందికోళ్ల కొండబాబు, బీసీ సెల్ కన్వీనర్ పెంకే రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం



ఏడిదలో లబ్ధిదారుకు కళ్లజోడు అందజేస్తున్న సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతున్నాయని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మండపేట మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్ష చేయించుకున్న ఏడిద గ్రామానికి చెందిన పలువురికి కళ్లజోళ్లు మంజూరయ్యాయి. వాటిని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుకూరి వీరవెంకట సత్యనారాయణ, నాయకులు బండారు కృష్ణ, విసుపురెడ్డి శివ, బూరిగ జానీ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కవలలకు కరాటే గోల్డ్ మెడల్స్



కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన కవలలు అక్షయలక్ష్మి, అక్షర లక్ష్మి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఇన్విటేషనల్ కెన్యూ రియో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్పారింగ్ విభాగంలో కవలలు గోల్డ్‌మెడల్ సాధించారు. రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగా పురుషోత్తం మనుమరాళ్లు అయిన దామిశెట్టి అక్షయలక్ష్మి, దామిశెట్టి అక్షర లక్ష్మి ఈ ఘనత సాధించారు. మూడేళ్ల చిరుప్రాయంలోనే అటు ఆత్మరక్షణ విద్య, ఇటు శాస్త్రీయ నృత్యంలోను ఆ కవలలు రాణిస్తున్నారు. ద్రాక్షారామకు చెందిన కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణ వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ద్రాక్షారామకు చెందిన డాన్స్ మాస్టర్ మహ్మద్ శ్యామ్‌జీ వద్ద శాస్త్రీయ నృత్యం అభ్యసిస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులైన వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు, జిల్లా సభ్యుడు దామిశెట్టి సత్యనారాయణమూర్తి, గీతాశ్రావణి దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

కార్పెంటర్స్ సంఘ నేతకు ఎమ్మెల్సీ అభినందనలు

కపిలేశ్వరపురం (మండపేట): కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన రామోజు కృష్ణకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందనలు తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికల్లో మండపేట పట్టణానికి చెందిన కార్పెంటర్ రామోజు కృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, వడ్రంగి సంఘాల నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం కృష్ణ ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు జేసీ ప్రసాద్, వేముల శ్రీరామమూర్తి, పొన్నాడ ప్రభాకర్ రావు, గొర్తి శ్రీను, కోటిపల్లి కృష్ణమాచార్యులు, చెల్లూరి కుమారస్వామి, వినకోట ప్రసాద్, పట్నాల శ్రీను, గోడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దాతల సాయంతో పాఠశాలల అభివృద్ధి



లొల్లలో దాత శ్రీనివాసచౌదరిని సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: ప్రభుత్వంతో పాటు దాతల ప్రోత్సాహంతో పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. ఆధునీకరించిన లొల్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రారంభ కార్యక్రమం మంగళవారం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం కె.నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి విశ్వమానవత సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి చేస్తున్న కృషిని ఎంపీపీ అభినందించారు. హెచ్‌ఎం నాగిరెడ్డి మాట్లాడుతూ శిథిలస్థితికి చేరిన పాఠశాల భవనాన్ని శ్రీనివాసచౌదరి ఆర్థిక సహకారం రూ.1.50 లక్షలతో ఆధునీకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేందర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ పి.రాంబాబు, ఉపాధ్యాయులు విజయశ్రీ, జేఆర్‌కే వేణి, దండు రాంబాబు, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.